తెలుగు దినపత్రిక

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్త పత్రిక

06-06-2026

శనివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 120

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575



# రామకృష్ణ లీలలు..!

- ఇక్కడ నిబంధనలు వర్తించవు
- అంచనాలు అక్కర్లేదు మమ్మల్ని సంప్రదిస్తే చాలు
- పఠాన్‌చెరు రూరల్ విద్యుత్ ఏఈ ఇష్టారాజ్యం
- కోట్ల రూపాయల విద్యుత్ చౌర్యం
- సాక్ష్యాత్తు డిఈ వద్దన్నా ఇక్కడే తిష్ట
- అంచనాలు లేకుండా పనులు చేసినట్లు నివేదిక
- విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డ భారీ అవినీతి

**నిఘా విభాగం, సిరి న్యూస్:**

అత్యంత భారీ ఆదాయం గల ఒక విద్యుత్ సెక్షన్‌లో గత మూడేళ్లుగా కోట్ల రూపాయల అవినీతి యథేచ్ఛగా సాగుతున్నా.. ఉన్నతాధికారులు కన్నెత్తి చూడని దుస్థితి వెలుగులోకి వచ్చింది. అక్కడ సదరు అధికారి ఏకంగా తనకంటూ ఒక ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేసుకొని, స్వలాభం కోసం ప్రభుత్వ సంస్థకు కోట్లలో నష్టం చేకూరుస్తున్నారు. ఇదే విషయాన్ని పక్కా ఆధారాలతో ఆ డివిజన్ డిఈ ఉన్నతాధికారులకు నివేదించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇందుకు కారణం సదరు ఏఈ వెనుక కార్పొరేట్ ఆఫీస్‌కు చెందిన ఒక పెద్ద అధికారి అండదండలు ఉండటమేనని తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు డివిజన్ పరిధిలోని పఠాన్‌చెరు రూరల్ సెక్షన్ ప్రస్తుతం వెంచర్లు, కాలనీలు, భారీ పరిశ్రమలతో విపరీతంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ఖరీదైన ఫోకల్ పోస్టుకు మూడేళ్ల క్రితం ఆంధ్ర ప్రాంతానికి చెందిన రామకృష్ణ అనే అధికారి అసిస్టెంట్ ఇంజనీర్‌గా వచ్చారు. నాటి నుండి విద్యుత్ శాఖ ఆదాయాన్ని పెంచడం పక్కనబెట్టి, సొంత ఆదాయాన్ని పెంచుకోవడమే పరమావధిగా మార్చుకున్నారు.

మిగతా 3వ పేజీలో..

# విద్యుత్ శాఖలో..



# పెద్ద సార్ కు కోపమొచ్చింది!

## పెన్షన్ ఆగిపోయింది!!

తెలంగాణ వచ్చాక వాళ్లకు మొదటి తేదీనే జీతం
మరి ఇపుడు అందరికిచ్చి వాళ్లకెందుకు ఆపినట్టు?
రైతు డిస్కమ్ వద్దనడమే సార్ కోపం తెప్పించిందా !
సంస్థ బాగుకోసం వాస్తవాలు చెప్పడమే వాళ్ల తప్పిదమా?
రేవంత్ సర్కారు మాట విద్యుత్ శాఖకు వర్తించదా?
కనీస ఖర్చులకు లేక వృద్ధాప్యంలో తప్పని తిప్పలు
ప్రభాకర్ రావు నిర్ణయాలే పెన్షన్ భారానికి కారణమా
యాజమాన్యాల తీరుపై ఉద్యోగ సంఘాల తీవ్ర మండిపాటు
మొదటిసారిగా వృద్ధులకు చెల్లించాల్సిన పెన్షన్ నిలిపివేత
మిగతా ఉద్యోగులందరికీ జీతాలు ఇచ్చి వృద్ధులకే అన్యాయం
వెంటనే పెన్షన్ విడుదల చేయాలని జేఏసీ డిమాండ్.



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత విద్యుత్ శాఖలో ప్రతి నెలా మొట్టమొదటగా జరిగే చెల్లింపు పెన్షన్. సంస్థ ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, వేలాది సంఖ్యలో ఉన్న పెన్షనర్లకు ఇచ్చే పెన్షన్ ఎన్నడూ మొదటి తేదీ దాటింది లేదు. అలాంటిది విద్యుత్ శాఖ చరిత్రలోనే మొట్టమొదటి సారి టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్, ట్రాన్స్కో, జెన్కో పరిధిలోని వేలాదిమంది

మిగతా 2వ పేజీలో..

విద్యుత్ శాఖలో ఏళ్లుగా ఒకే వరుస క్రమంలో జీతాల చెల్లింపులు జరుగుతుంటాయి. మొదట పెన్షనర్లకు ఇస్తారు, ఆ తర్వాత ఆర్టీసియన్లు, ఓఅండ్ఎమ్ విభాగానికి ఇస్తారు, చివరగా ప్రొవిన్షియల్ అధికారులకు జీతాలు వస్తుంటాయి. కానీ మే నెల చెల్లింపుల్లో మాత్రం అంతా ఉల్టా అయింది. అన్ని విభాగాల వారికీ అకౌంట్లలో డబ్బులు పడ్డా.. పెన్షన్ మాత్రం ఆగింది. దీని వెనుక విద్యుత్ శాఖలోని ఒక 'పెద్ద సార్' కోపమే కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల 'రైతు డిస్కమ్' ఏర్పాటుపై ఉవ్వెత్తున నిరసనలు వెలువడుతున్న క్రమంలో, సంస్థకు చెందిన కొందరు పెన్షనర్లు ప్రెస్ మీట్ పెట్టి వాస్తవాలను వెల్లడించడం సదరు సీనియర్ ఐఏఎస్ అధికారికి తీవ్ర కోపం తెప్పించిందట.



3

## ప్రజలకు ఉపాధి కల్పనే నిజమైన అభివృద్ధి

- 200 మంది మహిళలకు ప్రత్యక్ష ఉపాధి కల్పన
- సిద్దిపేటను దేశంలో రెండో షోలాపూర్‌గా తీర్చిదిద్దే అవకాశం



## పాలమూరు వెనుకబాటుతనానికి గత ప్రభుత్వమే కారణం

### పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటానన్న సీఎం రేవంత్

- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల కమిషన్లు తిన్నారని ఆరోపణ

2

## రూ.1600 కోట్ల విలువ చేసే బొగ్గు మాయం

- ఇప్పటివరకు అధికారులు తనిఖీలు చేయలేదు
- కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి సింగరేణిలో వరుస స్కామ్‌లు
- స్టాక్ యార్డుల్లో వుండాల్సిన బొగ్గు ఏమయింది?
- నిజం నిగ్గు తేల్చకపోతే సమ్మె తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ



**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ గా మారింది.. నైని కుంభకోణం

మిగతా 3వ పేజీలో..

## ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు



- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

పేదల జీవనోపాధికి ఏమాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్‌గా తీసుకుని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ, మధ్యతరగతి వర్గాలకు

మిగతా 2వ పేజీలో..



## అధికారుల నిర్లక్ష్యమే కారణం

అమీర్‌పేట్ అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన కవిత
ముందే ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్న వ్యాపారులు

2

## రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

పుప్పాలగూడ–ఖాజాగూడలో
హైడ్రా భారీ ఆపరేషన్
200 ఎకరాల ప్రభుత్వ భూమికి
ఫెన్సింగ్ ఏర్పాటు
ఆక్రమణలకు అడ్డుకట్ట వేసిన హైడ్రా
చారిత్రక రాతిగుట్టలు,
సహజ వనరుల పరిరక్షణకు చర్యలు
హైకోర్టు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో
పరిశీలనలు

**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–ఖాజాగూడ సరిహద్దులోని సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించింది. సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టింది.

హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. గతంలో

మిగతా 2వ పేజీలో..



## గండిపేట భూకబ్జా కుట్ర కేసులో అరెస్ట్

ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మ నాయుడు అదుపులోకి
ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం
నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు
కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



3



## నిధులు, నియామకాలు, నీళ్లలో విఫలం

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

3

## ఆహార భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

- అంగన్‌వాడీల్లో నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం
- మంత్రి ఆదేశాలతో సిబ్బందికి రేపు ప్రత్యేక శిక్షణ



3

## పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం: డీజీపీ సీవీ ఆనంద్

3

# పాలమూరు వెనుకబాటుతనానికి గత ప్రభుత్వమే కారణం

**మహబూబ్‌నగర్, జూన్ 5, సిరి న్యూస్:**

మహబూబ్‌నగర్ జిల్లా కరివేనలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని సాగునీరు, ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించామని, పాలమూరు భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

**పాలమూరు ప్రజలకు రుణపడి ఉన్నా**

2009లో కష్టకాలంలో తనను ఆదరించి మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించిన పాలమూరు ప్రజలను ఎప్పటికీ మరువలేనని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిందని, ఈ అంశాన్ని గతంలో చట్టసభల్లో కూడా ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించానని, ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు.

**కమిషన్ల కోసం ప్రాజెక్టులు**

గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అందులో రూ.27 వేల కోట్లు పంపు లిఫ్టులకే కేటాయించి భారీ కమిషన్లు పొందిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అత్యంత కీలకమైందని, 90 టీఎంసీల నీటిని వినియోగించే సామర్థ్యం దీనికి ఉందన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులన్నింటికంటే ఇది పెద్దదని పేర్కొన్నారు. ఇవన్నీ సక్రమంగా పూర్తయి ఉంటే జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు.

ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ కూడా చేయలేదని, కాల్వలు, రిజర్వాయర్ల నిర్మాణానికి భూములు సేకరించకుండా పనులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీలు ఇవ్వకుండా నీళ్లు అందించడం సాధ్యం కాదన్నారు. జిల్లాలో ఇంకా నాలుగు వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని చెప్పారు.

**ఆర్థిక ఇబ్బందుల్లోనూ పనులు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి పనులను కొనసాగిస్తోందని సీఎం తెలిపారు. యాభై శాతం నిధులు కూడా ఖర్చు పెట్టకుండా తొంభై శాతం పనులు పూర్తయ్యాయని గత పాలకులు చెప్పారని విమర్శించారు. సివిల్ పనులు, భూసేకరణ కోసం తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు, వడ్డీల కింద రూ.52,121 కోట్లు చెల్లించామని వెల్లడించారు. అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టుల పాత బిల్లుల కోసం రూ.22 వేల కోట్లు విడుదల చేశామని, అందులో దాదాపు రూ.8 వేల కోట్లు పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే కేటాయించినట్లు తెలిపారు.

రాబోయే రెండేళ్లలో జిల్లాలోని పెండింగ్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తామని భరోసా ఇచ్చారు.

# రెన్యువల్‌పై టెన్షన్..

## కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్లలో ఉత్కంఠ

**హైదరాబాద్, జూన్ 5:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్లకు నియమితులైన 37 మంది చైర్మన్ల పదవీకాలం జులై నెలతో ముగియనుండటంతో పార్టీలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఒకవైపు ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు మరో అవకాశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండగా, మరోవైపు కొత్త నాయకులు పదవులపై ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం సీట్లు త్యాగం చేసిన నేతలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయించింది. ఇప్పుడు వారి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో రెన్యువల్ ఉంటుందా లేదా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. కార్పొరేషన్ చైర్మన్ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చాలా మంది పార్టీ కార్యక్రమాలకు తగిన సమయం కేటాయించడం లేదనే అభిప్రాయం కూడా నాయకత్వంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అందరికీ రెన్యువల్ అవకాశం ఉండకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల TSAT, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవులను ప్రభుత్వం పొడిగించడంతో మిగతా చైర్మన్లలో కూడా ఆశలు చిగురించినట్లు తెలుస్తోంది. తమ పదవులు కూడా కొనసాగుతాయనే నమ్మకంతో కొందరు ఉన్నప్పటికీ, మరికొందరు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని కీలక సంస్థల చైర్మన్లకు మాత్రం పదవీకాల పొడిగింపు లభించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని TGIIC చైర్మన్‌గా కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే స్పోర్ట్స్ అథారిటీ, ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ కార్పొరేషన్ వంటి కొన్ని సంస్థల్లోనూ రెన్యువల్ అవకాశాలపై చర్చ నడుస్తోంది.



# అధికారుల నిర్లక్ష్యమే కారణం: కవిత

**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

అమీర్‌పేట్‌లోని మైత్రివనం ఎదురుగా ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్ కాంప్లెక్స్‌ను తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత సందర్శించారు. ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ భవనంలో ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని గత కొంతకాలంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవితకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత, ఈ అగ్నిప్రమాదం అనూహ్యంగా జరిగిన ఘటన కాదని పేర్కొన్నారు.

భవనం వెనుక భాగంలో ఉన్న మెస్ కారణంగా గతంలో కూడా షార్ట్‌సర్క్యూట్ ఘటనలు చోటుచేసుకున్నట్లు బాధితులు తెలిపారని ఆమె చెప్పారు. అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉందని మూడు నెలలుగా అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని కవిత విమర్శించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 నుంచి 4 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక వాహనాలు గంటకు పైగా ఆలస్యంగా చేరుకోవడం బాధాకరమని అన్నారు. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఉంటే నష్టం మరింత తగ్గే అవకాశముండేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన దుకాణాల యజమానుల వద్ద అన్ని అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాలు ఉన్నాయని కవిత తెలిపారు. నష్టపోయిన వ్యాపారులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. నగరంలోని వాణిజ్య సముదాయాలు, భారీ భవనాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కవిత స్పష్టం చేశారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు.

# విద్యుత్ శాఖలో.. 'పెద్ద సార్'కు కోపమొచ్చింది! పెన్షన్ ఆగిపోయింది!!

**మొదటిపేజీ తరువాయి**

వృద్ధులకు చెల్లించాల్సిన నూట ఎనభై కోట్ల రూపాయల పెన్షన్‌ను ఉన్నఫళంగా ఆపేసారు. విద్యుత్ శాఖలో డిస్కమ్‌లు ఏర్పడక ముందు కూడా ఎన్నడూ ఇలాంటి దుస్థితి రాలేదని ఉద్యోగ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. కానీ ఇప్పుడు విచిత్రంగా ఆర్టీసియన్లు, ఓ&ఎమ్ మరియు ప్రొవిన్షియల్ ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించిన యాజమాన్యం.. పాపం వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్ల చెల్లింపులను మాత్రం నిలిపివేసి కక్షసాధింపు చర్యలకు దిగింది.

**పెద్ద సార్ కోపమే కారణమట..**

విద్యుత్ శాఖలో ఏళ్లుగా ఒకే వరుస క్రమంలో జీతాల చెల్లింపులు జరుగుతుంటాయి. మొదట పెన్షనర్లకు ఇస్తారు, ఆ తర్వాత ఆర్టీసియన్లు, ఓఅండ్ఎమ్ విభాగానికి ఇస్తారు, చివరగా ప్రొవిన్షియల్ అధికారులకు జీతాలు వస్తుంటాయి. కానీ మే నెల చెల్లింపుల్లో మాత్రం అంతా ఉల్టా అయింది. అన్ని విభాగాల వారికీ అకౌంట్లలో డబ్బులు పడ్డా.. పెన్షన్ మాత్రం ఆగింది. దీని వెనుక విద్యుత్ శాఖలోని ఒక 'పెద్ద సార్' కోపమే కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల 'రైతు డిస్కమ్' ఏర్పాటుపై ఉవ్వెత్తున నిరసనలు వెలువడుతున్న క్రమంలో, సంస్థకు చెందిన కొందరు పెన్షనర్లు ప్రెస్ మీట్ పెట్టి వాస్తవాలను వెల్లడించడం సదరు సీనియర్ ఐఏఎస్ అధికారికి తీవ్ర కోపం తెప్పించిందట. అంతే.. 'వెంటనే పెన్షన్ ఆపండి' అంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారని, అందుకే ఈ నిలిపివేత జరిగిందన్న చర్చ విద్యుత్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. సదరు ఐఏఎస్ అధికారి ఇప్పటికే విద్యుత్ శాఖలోని ఆర్టీసియన్ల సమస్య జటిలం కావడానికి కారణమయ్యాడని, థర్డ్ డిస్కమ్ విషయంలో ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చి సర్కారు అబాసుపాలయ్యేలా చేశాడనే విమర్శలు ఉన్నాయి. అలాంటి అధికారి తన అహంకారాన్ని, అక్కరలేని కోపాన్ని ఎదురు తిరగలేని వయోవృద్ధులపై చూపడంపై విద్యుత్ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయ్.

**రేవంత్ సర్కారు మాట విద్యుత్ సంస్థలకు వర్తించదా?**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి నెల మొదటి తేదీనే అందరికీ జీతాలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకు అనుగుణంగా ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకటో తేదీనే జీతాలు వస్తున్నాయి. అయితే ప్రభుత్వ రంగ సంస్థలైన డిస్కమ్‌లలో యాజమాన్యాల తీరు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఇక్కడ ముఖ్యమంత్రి హామీకి విరుద్ధంగా జీతభత్యాల చెల్లింపులు సాగుతున్నాయి. ఐదు రోజులు గడుస్తున్నా ఇంతవరకు పెన్షనర్ల డబ్బులు చెల్లించకపోవడం ప్రభుత్వ ఆలోచనలకు విరుద్ధం కాదా? లేక డిస్కమ్ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన గ్యారెంటీ వర్తించదా? అని పెన్షనర్లు నిలదీస్తున్నారు.

**పెన్షన్ రాక టెన్షన్.. వృద్ధాప్యంలో మనోవేదన**

విద్యుత్ శాఖలోని వేలాది మంది విశ్రాంత కార్మికులకు, అధికారులకు చెల్లించాల్సిన పెన్షన్ ఐదు రోజులు గడుస్తున్నా చేతికి అందకపోవడంతో వయోభారంతో ఉన్న వృద్ధులు తీవ్ర టెన్షన్‌కు గురవుతున్నారు. వృద్ధాప్యంలో రకరకాల ఆరోగ్య సమస్యల మూలంగా మందు గోళీలకు, నెలవారీ కనీస అవసరాల ఖర్చులకు పెన్షన్ డబ్బులే వీరికి ఏకైక ఆధారం. ఒకటో తేదీని నమ్ముకుని జీవితం గడిపే పెన్షనర్లకు ఈ ఆలస్యం పెద్ద శాపంగా పరిణమించింది. ఒక్కొక్కరిది ఒక్కో రకమైన ఆర్థిక ప్రణాళిక ఉంటుందని, పెన్షన్ సకాలంలో రాకపోవడంతో ఎన్నో కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మాజీ సీఎండీ ప్రభాకర్ రావు నిర్ణయాలకే ఈ భారానికి కారణమా?**

తెలంగాణ ఏర్పడ్డాక విద్యుత్ శాఖలో అంతా తానై నడిపిన అప్పటి ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు హయాంలో తీసుకున్న కొన్ని నిర్ణయం వల్లనే ప్రస్తుత పెన్షన్ భారానికి కారణమనే విశ్లేషణలు కూడా వస్తున్నాయి. అప్పట్లో ఆంధ్ర, తెలంగాణ ఉద్యోగుల విభజన సమయంలో పెన్షన్ ఆప్షన్‌ను ఆంధ్ర అధికారులంతా ప్రస్తుత టీజీఎస్పీడీసీఎల్‌లో పెట్టుకున్నారట. అప్పట్లో తెలంగాణ అధికారులు దీనిని అడ్డుకున్నా వినకుండా, ప్రభాకర్ రావు వారికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టీజీఎస్పీడీసీఎల్ ద్వారానే పెన్షన్ వచ్చేలా వారి ఆప్షన్స్‌కు రాజముద్ర వేశారు. ఆ తప్పుడు నిర్ణయం వల్లే నాడు టీజీఎస్పీడీసీఎల్‌లో కేవలం నలభై కోట్లు ఉండాల్సిన పెన్షన్ భారం.. నేడు ఏకంగా ఎనభై కోట్లకు చేరి సంస్థకు పెను భారంగా మారిందని తెలుస్తోంది.

**పెన్షన్ ఆపడం న్యాయం కాదు: విద్యుత్ జాక్ డిమాండ్**

తెలంగాణ విద్యుత్ శాఖలోని రెండు డిస్కమ్‌ల పరిధిలో పెన్షనర్లకు పెన్షన్ చెల్లించకపోవడం ఎంతమాత్రం న్యాయం కాదని తెలంగాణ విద్యుత్ జేఏసీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ట్రాన్స్కో సీఎండీ కి జేఏసీ నాయకులు ఘాటుగా లేఖలు రాశారు. విద్యుత్ శాఖ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వృద్ధుల పెన్షన్లను ఆపడం ఏంటని వారు యాజమాన్యాలను ప్రశ్నించారు. తక్షణమే ట్రాన్స్కో, డిస్కమ్, జెన్కో ల పరిధిలోని పెన్షనర్లకు పెన్షన్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్

**మహబూబ్‌నగర్, జూన్ 5, సిరి న్యూస్:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగు, తాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో ఇది కీలకమైన రోజని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని, అవసరమైన నిధులు సమకూర్చి పనులు వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులను ఇప్పుడు పూర్తి చేయకపోతే జిల్లా ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో పాలమూరు రూపురేఖలు మారుతాయని, సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని తెలిపారు.

**గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు ప్రణాళిక**

ప్రాజెక్టులపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గూడెందొడ్డి రిజర్వాయర్‌లో 15 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉందన్నారు. కర్ణాటకలో నిర్మించిన బ్రిడ్జి బ్యారేజీల కారణంగా పెద్ద ఎత్తున నీటి నిల్వ జరుగుతోందని, ఈ అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఉమ్మడి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఖర్చులను కూడా రెండు రాష్ట్రాలు పంచుకునే విధంగా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టులు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం ఒక టీఎంసీ నీటితో సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎస్ఆర్ఎస్పీ, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులు కాంగ్రెస్ పాలనలోనే నిర్మించబడ్డాయని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

**ఇరిగేషన్ రంగాన్ని బీఆర్ఎస్ దెబ్బతీసింది: ఉత్తమ్**

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఇరిగేషన్ రంగం తీవ్రంగా దెబ్బతిందని ఆరోపించారు. భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయని గత ప్రభుత్వం ప్రచారం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆయకట్టుకు నీరు చేరలేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు మార్చడం వల్ల భారీ నష్టం జరిగిందని, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ప్రయోజనం కలగలేదని విమర్శించారు. కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు సహా పలు ప్రాజెక్టులు గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. కృష్ణా జలాల హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని,

**ధాన్య సేకరణలో తెలంగాణ అగ్రస్థానం**

ఈ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 71.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గతంతో పోలిస్తే 60 శాతానికి పైగా అధిక ధాన్యం సేకరించామని చెప్పారు.

# ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**మొదటిపేజీ తరువాయి**

లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్షించారు. 2026 27కు క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చామని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా నగరానికి 3040 కి.మీ దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని, ఉపాధి దూరమవడంతోపాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదని చెప్పారు. ఫలితంగా ఆ గృహాలు నిరుపయోగంగా మిగిలాయన్నారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం చేయకుండా పేదలు



ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదలకు సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్‌లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

**మొదటిపేజీ తరువాయి**

హెచ్ఎండీఏకు కేటాయించిన భూముల సరిహద్దులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని రాతిగుట్టల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న పర్యావరణ సంస్థల విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లలో 293 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, వివిధ కేటాయింపులు, భూ వివాదాల అనంతరం సుమారు 200 ఎకరాల భూమి హెచ్ఎండీఏ పరిధిలో మిగిలింది. ఈ ప్రాంతంలో విలువైన చారిత్రక రాతిగుట్టలు, సహజ శిలా నిర్మాణాలు ఉండటంతో వాటి పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు.

పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం ఈ రాతిగుట్టలకు సుమారు 250 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉంది. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ శిలా నిర్మాణాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అరుదైన భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి. వీటి సంరక్షణ ద్వారా ప్రకృతి వారసత్వాన్ని కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

హైడ్రా చర్యలను పర్యావరణ సంస్థల ప్రతినిధులు స్వాగతించారు. సహజసిద్ధమైన కొండలు, రాతి నిర్మాణాలు, పచ్చదనాన్ని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు విలువైన ప్రకృతి సంపదను అందిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. అలాగే ఈ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.

ఈ ప్రాంతానికి సమీపంలోని భగీరథమ్మ చెరువు పునరుద్ధరణ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఎత్తైన కొండలు, సహజ రాతిగుట్టలు, చెరువు సమన్వయంతో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని స్థానికులు, పర్యావరణవేత్తలు భావిస్తున్నారు.

ప్రభుత్వ భూములు, ప్రకృతి సంపద, చారిత్రక వారసత్వ పరిరక్షణలో హైడ్రా చేపట్టిన ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.





# రూ.1600 కోట్ల విలువ చేసే బొగ్గు మాయం

**మొదటిపేజీ తరువాయి**

మొదలుకుని వందల అక్రమాల విషయంలో కేంద్రం నుంచి స్పందన లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈమేరకు ఆయన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. ఎప్పటికప్పుడు నిల్వలు తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ కానీ, కాగ్ అధికారులు కానీ ఇప్పటిదాకా ఎందుకు తనిఖీలు చేపట్టలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి మనుగడనే దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరుస స్కాంలతో వణికిపోతున్న సింగరేణిలో రూ.1600 కోట్లు విలువ చేసే బొగ్గు మాయం చేసి సంస్థ గొంతుకోసే కుట్రకు తెరతీశారని ఆరోపించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల స్కామ్ జరగడం సంస్థ మనుగడనే ప్రమాదంలోకి నెడుతోందన్నారు. సింగరేణి అధికారిక వెబ్ సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించకపోవడం ఈ కుంభకోణాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గు మీద కోల్ సెస్ తోపాటు, ఇన్ కమ్ టాక్స్ కూడా కట్టామని లెక్కలు చూపిస్తున్నా క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడం వెనక ఎవరి హస్తం ఉందో తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్ లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం1 లో ఆరు లక్షలు, రామగుండం2 లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 .40 లక్షలు, ఇల్లందులో 3.50 లక్షలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు.. కానీ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ లోనే గనుల వద్ద నిల్వలను తనిఖీ చేసే గనుల శాఖ అధికారుల బృందాలు రాకపోవడం, చివరికి కాగ్ అధికారులు కూడా ఇప్పటిదాకా తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిలపక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కుంభకోణమే కాక ఇటీవల బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన నైని బొగ్గు గని టెండర్ల స్కాం కూడా దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిందన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి సింగరేణిని కబళించేందుకు సీఎం రేవంత్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే నిబంధన పెట్టి కోరుకున్న వారికి టెండర్లు కట్టబెట్టే కుతంత్రాన్ని అమలుచేశారన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని తెలినా ఇప్పటిదాకా దీనిపై మీరు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని కేటీఆర్ గుర్తుచేశారు.

**అక్రమార్కుల భరతం పట్టే దిశగా అడుగు వేయలేదు**

నైని కోల్ స్కామ్ ను బీఆర్ఎస్ బయటపెట్టగానే ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియను రద్దుచేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు తప్ప టెండర్లలో అక్రమార్కుల భరతం పట్టే దిశగా ఒక్క అడుగు వేయలేదన్నారు. టెండర్ పోటీదారులను బెదిరించి, భయపెట్టి ప్రక్రియ నుంచి తప్పించే పన్నాగాలు సాగినా దీనికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదు. ఈ టెండర్ల అక్రమాలను నిగ్గు తేల్చడానికి కేంద్రం వేసిన కమిటీ ఇప్పటివరకూ ఏం తేల్చిందో కూడా పత్తాలేదు. నైని కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి మూడురోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు మొద్దునిద్ర పోతోందో సింగరేణి కార్మికులకు సమాధానం చెప్పాలన్నారు.గతంలో నైని స్కామ్ తోపాటు.. 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల నిబంధనలకు పాతరేసి నేషనల్ యావరేజీని కూడా మించి అత్యధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి నేరుగా డీజిల్ కొనుగోలు చేసే విధానాన్ని అర్థాంతరంగా రద్దుచేసి అందులోనూ దోపిడీకి తెరలేపారు. అలాగే పేలుడు పదార్థాల కొనుగోళ్లలోనూ కోల్ ఇండియా కంటే 30 శాతం అధిక నిధులు చెల్లించి అనుయాయులకు కట్టబెట్టారు. అంతేకాకుండా చివరికి మెస్సీతో ముఖ్యమంత్రి ఫుట్ బాల్ మ్యాచ్ కోసం రూ.110 కోట్ల సింగరేణి నిధులను దుర్వినియోగం చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇలా వరుస కుంభకోణాలు జరుగుతున్నా అక్రమార్కుల భరతం పట్టకుండా కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం వెనక కాంగ్రెస్‌బీజేపీ చీకటి ఒప్పందాలే కారణమని కార్మికులకు అర్థమైపోయిందన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమ దందాలను వెలుగులోకి తెచ్చేందుకు చివరికి ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా వివరాలు బయటకు పొక్కకుండా దుష్టశక్తులు అడ్డుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన రూ.1600 కోట్ల సింగరేణి బొగ్గు కుంభకోణంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కార్మికుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కుంభకోణంపై ఒకవేళ మీరు విచారణ జరపకపోతే కార్మికలోకంతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# రామ‘కృష్ణ’ లీలలు..!

**నా సెక్షన్.. నా ఇష్టం..**

విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం లైన్ క్లియరెన్స్ తీసుకోవాల్సి వచ్చినప్పుడు పై అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి, అనుమతితో లాగ్ బుక్‌లో నమోదు చేయాలి. కానీ పఠాన్‌చెరు రూరల్ సెక్షన్‌లో మాత్రం ఏఈ రామకృష్ణ కొందరు పారిశ్రామికవేత్తలకు, వెంచర్ల నిర్వాహకులకు లబ్ధి చేకూర్చడానికి ఎలాంటి లాగ్ బుక్ ఎంట్రీ లేకుండానే అనధికారికంగా ఎల్సీలు ఇచ్చేశారు. జనవరి 30న ఏకంగా నాలుగు ఫీడర్లకు ఎల్సీ తీసుకున్న వివరాలను అధికారిక పోర్టల్‌లో నమోదు చేయకుండా దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ నిలిపివేసి పనులు చేయించినట్లు అధికారికంగా నిర్ధారణ అయింది. అంతేకాదు, జనవరి నెలలో అసలు మంజూరే కాని 11 కేవీ కేబుల్‌ను ఫీడర్‌లో లాగేశారు. దీనిపై పై అధికారులు వివరణ అడిగితే.. ‘నా సెక్షన్.. నా ఇష్టం’ అంటూ బరితెగించి సమాధానం చెప్పడం ఆయన ప్రవృత్తికి అద్దం పడుతోంది.

**వెంచర్లకు 25 శాతం స్కీమ్ లబ్ధి**

ఈ సెక్షన్ పరిధిలో ఏ పని కావాలన్నా వినియోగదారులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోగానే, ఆ అప్లికేషన్ సాంకేతిక అంచనాల కోసం ఏఈ రామకృష్ణ వద్దకు చేరుతుంది. ఇక అప్పటినుండి దరఖాస్తుదారుడితో అసలు బేరం మొదలవుతుంది. వాస్తవ అంచనాలు వేస్తే ప్రభుత్వానికి భారీగా



ఫీజులు కట్టాల్సి వస్తుందని.. అదే తనకు ‘25 శాతం’ ఇస్తే అంచనా విలువను భారీగా తగ్గించి పంపుతానని ఓపెన్‌గా డీల్ మాట్లాడుతారట. ఇలా మూడేళ్ల కాలంలో వందకు పైగా వినియోగదారులకు మరియు లెక్కలేనన్ని వెంచర్లకు భారీగా అంచనాలు తగ్గించి, విద్యుత్ శాఖకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లేలా చేశారు. చివరికి ఒక ప్లాస్టిక్ కంపెనీకి లబ్ధి చేకూర్చడానికి ఏకంగా కేటగిరీని సైతం మార్చేసినట్లు ఉన్నతాధికారుల తనిఖీల్లో తేలింది.

**విజిలెన్స్, డీపీ తనిఖీల్లో దొరికిపోయిన చౌర్యం**

సంగారెడ్డి విద్యుత్ తనిఖీల్లో ఒక వెంచర్‌కు ఏకంగా 15 రోజుల పాటు నేరుగా విద్యుత్ చౌర్యం జరిగినట్లు ధ్రువీకరించారు. సదరు వెంచర్ నిర్వాహకులు అంచనాల మంజూరు ఆలస్యం కావడంతో ఏఈ రామకృష్ణకు ముడుపులు అందించి, ఆయన అనుమతితోనే ఒక గృహోపయోగ కనెక్షన్ నుండి కరెంట్ దొంగిలించినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో అధికారులు ఆ సర్వీసులపై తెఫ్ట్ కేసు నమోదు చేశారు. అలాగే గత సంవత్సరం మైనింగ్ పర్మిషన్ లేని కొన్ని క్రషర్ల విద్యుత్ సర్వీసులను తొలగించిన తరుణంలో.. అవి దొంగచాటుగా విద్యుత్ చౌర్యం చేసుకోవడానికి కూడా ఈయనే సహకరించాడన్న ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి.

**ఫిర్యాదు చేసినా లొంగిపోయిన నాటి ఎస్ఈ**

పఠాన్‌చెరు రూరల్ ఏఈ రామకృష్ణ చేస్తున్న అవినీతి ఆగడాలపై చర్యలు తీసుకోవాలని, అతని ఉద్యోగ నిర్లక్ష్యంపై పూర్తి నివేదికను రూపొందించి పఠాన్‌చెరు డిఈ పై అధికారులకు లేఖ రాశారు. ‘ఈ ఏఈ మా డివిజన్‌కు వద్దు.. ఇతని వల్ల పెద్ద సమస్యగా మారింది’ అని డీఈ స్వయంగా 12 మెమోలు జారీ చేస్తూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా, అప్పట్లో ఎస్ఈగా ఉన్న అధికారి కార్పొరేట్ వత్తిళ్లకు తలొగ్గి ఆ ఫైల్‌ను తొక్కిపెట్టారు. విజిలెన్స్ అధికారులు సైతం ఏఈ తప్పులను ఆధారాలతో సహా ధ్రువీకరించినప్పటికీ నాటి ఎస్ఈ బదిలీ చేయకపోవడంతో రామకృష్ణ అవినీతి సామ్రాజ్యం మరింత విస్తరించింది. అప్పుడే గనుక కఠిన చర్యలు తీసుకొని ఉంటే రూరల్ సెక్షన్‌లో విద్యుత్ శాఖకు కోట్లాది రూపాయల ఆదాయం వచ్చేది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే మరింత అవినీతికి పరోక్షంగా సహకరించినట్టేనని ఆ శాఖ ఉద్యోగులే వాపోతున్నారు.

# పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం: డీజీపీ సీవీ ఆనంద్

- **తొలి నెలలోనే మూడు ప్రధాన దోపిడీ కేసుల ఛేదన**
- **ప్రధాని, కేంద్ర హోంమంత్రి పర్యటనలకు విజయవంతమైన బందోబస్తు**
- **ట్రాఫిక్, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధక విభాగాల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి నెలలో చేపట్టిన చర్యలపై డీజీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలు కీలక అంశాల్లో పురోగతి సాధించామని పేర్కొన్నారు. తొలి నెలలోనే మూడు ప్రధాన దోపిడీ కేసులను ఛేదించామని డీజీపీ తెలిపారు. నేరాల దర్యాప్తులో వేగం పెంచి నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టే దిశగా పోలీసు శాఖ సమర్థంగా పనిచేసిందని చెప్పారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి రాష్ట్ర పర్యటనల సందర్భంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. భారీ స్థాయిలో బందోబస్తు చేపట్టడం ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బక్రీద్ పండుగను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసిందని వివరించారు. రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కొత్త విభాగాల ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేశామని సీవీ ఆనంద్ తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, విజిలెన్స్ అమలు, ఆహార కల్తీ నిరోధక చర్యల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలనే ఆలోచనపై కసరత్తు జరుగుతోందన్నారు. ప్రజా సమస్యలకు మరింత సమర్థవంతంగా స్పందించడమే ఈ ప్రతిపాదనల ప్రధాన లక్ష్యమని చెప్పారు. పోలీసు శాఖలో సిబ్బంది వినియోగం, అవసరాలపై సమగ్ర అంచనా వేసేందుకు సిబ్బంది ఆడిట్ ప్రక్రియను ప్రారంభించామని డీజీపీ వెల్లడించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారా సేవల నాణ్యతను పెంచేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అవసరమైన చోట సిబ్బంది బలోపేతానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రప్రజలకు మెరుగైన భద్రతా సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. సాంకేతికత, సమర్థవంతమైన పరిపాలన, వేగవంతమైన స్పందన ద్వారా తెలంగాణ పోలీసు శాఖను మరింత ప్రజామిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నివారణకు కూడా ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు

# ప్రజలకు ఉపాధి కల్పనే నిజమైన అభివృద్ధి

**సిద్దిపేట, జూన్ 5, సిరి న్యూస్:**

సిద్దిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్వితీయ ఎంటర్‌ప్రైజెస్ దుస్తుల తయారీ పరిశ్రమను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు, కళాశాలలు నిర్మించడం మాత్రమే కాదని, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమేనన్నారు. సిద్దిపేట మహిళలకు, గృహిణులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే తన కల టెక్ లైన్, అద్వితీయ సంస్థల సహకారంతో నేడు సాకారమవుతోందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యూనిఫామ్‌ల తయారీ ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్న టెక్ లైన్ సంస్థ అధినేత్రి భువనేశ్వరి సేవలను కొనియాడారు. లాభాపేక్ష కంటే ఉపాధి కల్పనకే ప్రాధాన్యతనిస్తూ ప్రశాంత్ నగర్‌లో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసిన కోఆపరేటివ్ చైర్మన్ తోట శ్రీకాంత్ రెడ్డి బృందాన్ని అభినందించారు. ఈ పరిశ్రమలో 70 మంది మహిళలు పనిచేస్తున్నారని, త్వరలోనే స్టిచ్చింగ్ విభాగంలో 100 మంది, ప్యాకింగ్ విభాగంలో మరో 100 మంది మహిళలకు ఉపాధి లభించనుందని తెలిపారు. సాధారణంగా నెల రోజుల సమయం పట్టే శిక్షణను సిద్దిపేట మహిళలు కేవలం నాలుగు రోజుల్లోనే నేర్చుకోవడం వారి ప్రతిభకు నిదర్శనమని అన్నారు. మహిళలంతా నాణ్యతతో కూడిన పనితీరును కనబరిస్తే మరిన్ని ఆర్డర్లు వస్తాయని, తద్వారా ఉపాధి అవకాశాలు 200 నుంచి 400, అనంతరం 800 మందికి విస్తరించే అవకాశం ఉందని వివరించారు.గతంలో సిద్దిపేటలో 6 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించినప్పటికీ అవి గృహ స్థాయికే పరిమితమయ్యాయని, కానీ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలంటే అద్వితీయ సంస్థలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. మహిళల శ్రమ, క్రమశిక్షణ, నాణ్యత ఆధారంగానే భవిష్యత్తులో సిద్దిపేట దేశంలో రెండో షోలాపూర్‌గా ఎదిగే అవకాశం ఉందన్నారు. సంస్థ విస్తరణ కోసం ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో తానే స్వయంగా మాట్లాడి మరిన్ని ఆర్డర్లు వచ్చేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. దేశంలోని సుమారు రూ.60 వేల కోట్ల టెక్స్‌టైల్ పరిశ్రమలో 70 శాతం వాటా స్టిచ్చింగ్ రంగానిదేనని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిధులు, నియామకాలు, నీళ్లలో విఫలం

**మహబూబాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి ‘డబుల్ ఇంజిన్ సర్కార్’ అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## గండిపేట భూకబ్జా కుట్ర కేసులో అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

గండిపేట ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు జరిగిన కుట్ర కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం, గండిపేట పరిధిలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ పత్రాలను సృష్టించి భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

ఈ వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడు కీలక పాత్ర పోషించినట్లు గుర్తించిన దర్యాప్తు బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. భూకబ్జా ప్రయత్నంలో మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకునేందుకు నకిలీ పత్రాలను వినియోగించడం తీవ్రమైన నేరమని పోలీసులు పేర్కొన్నారు. భూముల వ్యవహారాల్లో మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల కొనుగోలు సమయంలో ప్రజలు సంబంధిత రికార్డులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.

ఇటీవలి కాలంలో ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, నకిలీ పత్రాల వినియోగానికి సంబంధించిన కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు శాఖలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలను గుర్తించి అడ్డుకునేందుకు సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని, భూముల అక్రమ బదిలీలు, నకిలీ పత్రాల తయారీ వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రను కూడా వెలికితీస్తామని సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## ఆహార భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, జూన్ 5, సిరి న్యూస్:**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్‌వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్‌వాడీ సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డేను పురస్కరించుకుని ఈ ఆదివారం (7వ తేదీ)రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షితమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్‌వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫఎసఎసఏఐ) మార్గదర్శకాల ప్రకారం వీరు శిక్షణ ఇస్తారు. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

## అగ్నిప్రమాదంపై ఆరా తీస్తున్నాం

- **మైత్రీవనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని సందర్శించిన హైడ్రా కమిషనర్**
- **కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తాం**

**తెలంగాణ బ్యూరో జూన్ 5, సిరి న్యూస్:**

ఈ నెల 4న హైదరాబాద్ లోని మైత్రివనంలో జరిగిన అగ్ని ప్రమాదంపై ఆరా తీస్తున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. ఆ కాంప్లెక్స్ కు ఆనుకొనే ఉన్న హర్ష మెస్ డీలక్స్‌లో స్పార్క్ తో ప్రమాదం జరిగిందా?.. షార్ట్ సర్క్యూట్ తో జరిగిందా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలుతుందని చెప్పారు. మైత్రివనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హర్ష మెస్‌నూ పరిశీలించిన రంగనాథ్..అక్కడ మీడియాతో మాట్లాడారు. మైత్రివనం సమీపంలో ఉన్న కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తామన్నారు. నాలాను ఆక్రమించి భవనం నిర్మాణం జరిగితే కచ్చితంగా కూలగొడతామని స్పష్టం చేశారు. కేఎస్ఆర్ భవనం షాప్స్ పక్కనే ఉన్న హర్ష డీలక్స్ మెస్‌ను కూడా పరిశీలించామన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన భవనానికి ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పాయింట్లు ఒకే వైపు ఉన్నాయన్నారు. బిల్డింగ్‌కు ఫైర్ సేఫ్టీ నిబంధనలు లేవని తెలిపారు. హర్ష మెస్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని బాధితులు చెప్తున్నారని.. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు. నాంపల్లి బిల్డింగ్ అగ్నిప్రమాదం అనంతరం అన్ని భవనాలకు ఎన్ఓసీలు జారీ చేశామన్నారు.

# ఆదర్శ గ్రామంలో గ్రామసభ




**• ఘన ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన**

**తూప్రాన్ జూన్ 5 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మల్కాపూర్ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఘన ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకం సంరక్షణ, నేల భూసార పరీక్షలపై గ్రామ సభలో ప్రధానంగా చర్చించారు. అంతకుముందు గ్రామపంచాయతీ ప్రాంగణంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు, అనంతరం సర్పంచ్ ఛాంబర్ లో స్టీల్ బ్యాంకు ను ప్రదర్శించారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది స్టీల్ బ్యాంకు ను వాడకల్లోకి తెచ్చామన్నారు. అలాగే వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు నేల సారవంతానికి నవధాన్యాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు మేకిన్ యువత, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# కబ్జాదారులపై హుడా పంజా



**• స్టేడియం స్థలంలో అక్రమ నిర్మాణాల నేలమట్టం**

**జిన్నారం జూన్ 5 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ పరిధిలో స్టేడియం కోసం కేటాయించిన స్థలం కబ్జాకు గురి కావడంతో, సమాచారం అందుకున్న హుడా అధికారులు శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు.ఈ సందర్భంగా హుడా సైట్ ఇంచార్జ మాట్లాడుతూ హుడా పరిధిలోని ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన అక్రమ నిర్మాణాలను భారీ బందోబస్తు మధ్య కూల్చి వేసాం అని తెలిపారు. హుడా భూములను అక్రమించి ఎవరైనా ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో ఎస్సై కృష్ణారెడ్డి, హుడా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోళ్లు స్పీడప్ కావాలి

**అదనపు కలెక్టర్ నగేష్**

**రామాయంపేట, జూన్ 5( సిరి న్యూస్)**

జొన్నల కొనుగోళ్లు స్పీడప్ చేయాలని, వరి ధాన్యం అన్లోడింగ్ త్వరగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.శుక్రవారం రామాయంపేట మండలంలోని వ్యవసాయ మార్కెట్ గోదాములను పరి శీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. జొన్నల కొనుగోళ్లు స్పీడప్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జొన్నల కొనుగోళ్లలో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని, జొన్న రైతుల అకౌంట్లో చెల్లింపులు సక్రమంగా చేయాలన్నారు. వరి ధాన్యం అన్లోడింగ్ త్వరగా జరగాలని లారీలను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రజనీ కుమారి తో పాటు అధికారులు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# రాజకీయాల 'జగడం'.. ప్రగతికి శాపం !

## పెద్దన్న పాత్ర ఎక్కడ?

కేంద్రం వైఖరి – రాష్ట్రం పోరాటం ఫెడరల్ (సమాఖ్య) స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నడిస్తేనే దేశం, రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతాయి. కానీ, దురదృష్టవశాత్తూ తెలంగాణ రాష్ట్రం విషయంలో గత దశాబ్ద కాలంగా, ప్రత్యేకించి ప్రస్తుత రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న 'జగడం' రాష్ట్ర అభివృద్ధికి ఒక పెద్ద ప్రతిబంధకంగా మారుతోంది. రాజకీయ ప్రయోజనాలు, సిద్ధాంతపరమైన విభేదాలు అభివృద్ధి అజెండాను పక్కకు నెట్టేస్తున్నాయనడానికి తాజా పరిణామాలు స్పష్టమైన ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. తెలంగాణ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసేలా కేంద్రం అనుసరిస్తున్న కొన్ని విధానాలు రాష్ట్రానికి పెను సవాలుగా మారాయి. రాష్ట్రం మౌలిక వసతుల కల్పన కోసం సేకరించే రుణాలపై కేంద్రం కఠినమైన ఆంక్షలు విధించడం వల్ల అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధుల కొరత ఏర్పడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు భారీగా పన్నుల రూపంలో ఆదాయాన్ని అందిస్తున్న తెలంగాణకు, కేంద్ర పన్నుల డివిడెండ్‌లో దక్కాల్సిన వాటా ఆశించిన స్థాయిలో రావడం లేదనేది గట్టి వాదన. స్థానిక సంస్థలకు (పంచాయతీలు, మున్సిపాలిటీలు) రావాల్సిన సబ్‌వెన్షన్లు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోంది.

**పెండింగ్ ప్రాజెక్టులు - విభజన హామీల విస్మరణ**

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 లో ఇచ్చిన ప్రధాన హామీలు దశాబ్దం దాటినా కాగితాలకే పరిమితం కావడం కేంద్ర వైఖరిని ఎత్తిచూపుతోంది. కాజీపేటలో మంజూరు కావాల్సిన పూర్తిస్థాయి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో కేవలం వ్యాగన్ పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌తోనే కేంద్రం సరిపెట్టింది. తెలంగాణ పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చే బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై కేంద్రం చేతులెత్తేసింది. ములుగు గిరిజన వర్సిటీ ఏర్పాటులో ఏళ్ల తరబడి జరిగిన జాప్యం వల్ల గిరిజన విద్యార్థులకు ఉపాధి, విద్యావకాశాలు దక్కకుండా పోయాయి. హైదరాబాద్ ఐటీ రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారాల్సిన ఐటీఐఆర్ ప్రాజెక్టును కేంద్రం రద్దు చేయడం రాష్ట్ర ఐటీ విస్తరణపై తీవ్ర ప్రభావం చూపింది. కేంద్ర–రాష్ట్రాల మధ్య నిరంతరం మండుతున్న మరో వివాదాస్పదం 'వరి కొనుగోళ్లు'. ఎఫ్‌సీఐ ద్వారా తెలంగాణ ధాన్యం సేకరించే విషయంలో కేంద్రం అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలు, కోటాల తగ్గింపు




స్థానిక రైతుల్లో తీవ్ర అభద్రతాభావాన్ని నింపాయి. వ్యవసాయ రంగంపై రెండు ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపించడం దేశానికే నష్టదాయకం.

**రాజకీయ వైషమ్యాలు...**

అభివృద్ధిపై చర్చించాల్సిన వేదికలు కాస్తా, రాజకీయ కక్షసాధింపు చర్యల వేదికలుగా మారుతున్నాయి. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాష్ట్రంలోని అధికార పార్టీ నేతలను టార్గెట్ చేసేందుకు కేంద్రం వాడుకుంటోందనే ఆరోపణలు, ప్రతిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాజీలేని పోరాటానికి దిగడం నిత్యకృత్యమైంది. ఈ 'రాజకీయ యుద్ధం' వల్ల అసలైన అభివృద్ధి ప్రాధాన్యతలు పక్కదారి పడుతున్నాయి. ఢిల్లీ వర్సెస్ గల్లీగా సాగుతున్న ఈ జగడం వల్ల అంతిమంగా నష్టపోయేది తెలంగాణ ప్రజలే. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. అభివృద్ధి విషయంలో కేంద్రం 'పెద్దన్న' పాత్ర పోషిస్తూ రాష్ట్రానికి రావాల్సిన రాజ్యాంగబద్ధమైన నిధులను, ప్రాజెక్టులను సకాలంలో అందించాలి. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని కేవలం విమర్శించడానికే పరిమితం కాకుండా, వ్యూహాత్మకంగా నిధులు రాబట్టుకునేలా పాలనాపరమైన ఒత్తిడి తీసుకురావాలి. 'సహకార సమాఖ్య' అనేది కేవలం నినాదంగా కాకుండా, ఆచరణలో కనిపిస్తేనే తెలంగాణ మరింత ప్రగతి పథంలో దూసుకుపోగలదు.

.....ఎ.సి.ఎస్.రావు

# మితిమీరిన జంక్ ఫుడ్ తింటే.. అనారోగ్యమే..!

**• నియంత్రణ లేకపోతే వ్యాధులు తప్పవు**

**• జంక్ ఫుడ్‌తో ముప్పు**

**• నిత్యం అనారోగ్య సమస్యలకు స్వాగతం పలుకుతున్న ఆహారపు అలవాట్లు**

**గుమ్మడిదల, జూన్ 4 (సిరి న్యూస్):**

ఆధునిక జీవనశైలిలో భాగంగా జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ ఆహార సంస్కృతి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై విక్రయించే చిరుతిండి పదార్థాలపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ మారుతున్న ఆహారపు అలవాట్లు భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**గ్రామాల వరకూ విస్తరించిన ఫాస్ట్ ఫుడ్ కల్చర్**

రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన బండ్లు, చిన్న దుకాణాల్లో పానీపూరీలు, చాట్లు, మిక్సర్లు, పకోడీలు, బజ్జీలు, నూడిల్స్, ఫ్రైడ్ రైస్, బిర్యానీలు, చికెన్ పకోడీలు, చికెన్ రోల్స్, కర్రీలు, మటన్ వంటకాలు వంటి అనేక రకాల రెడీమేడ్ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. రుచికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలు వీటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల ఒత్తిడితో ఇంట్లో వంట చేసుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. దీంతో చాలామంది బయట దొరికే ఆహారం లేదా డెలివరీ యాప్‌ల ద్వారా తెప్పించుకునే ఫుడ్‌పైనే ఆధారపడుతున్నారు. ఫలితంగా ఇంటి వంటకు బదులుగా జంక్ ఫుడ్ వినియోగం





పెరుగుతోంది.

**రుచికోసం ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న ప్రజలు**

జంక్ ఫుడ్ తయారీలో అధికంగా నూనెలు, ఉప్పు, మసాలా పదార్థాలు, కృత్రిమ రంగులు, రుచికర ద్రవ్యాలు, ప్రిజర్వేటివ్‌లు వినియోగిస్తుంటారు. ఇలాంటి ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోవడం, అధిక బరువు, జీర్ణకోశ సమస్యలు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తీసుకునే వారిలో క్యాన్సర్, గుండెజబ్బులు, మెటబాలిక్ సమస్యలు పెరిగే అవకాశాలు ఉన్నాయని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. పరిమితంగా జంక్ ఫుడ్ తీసుకోవడం పెద్ద సమస్య కాకపోయినా, ప్రతిరోజూ అలవాటుగా మార్చుకోవడం ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, యువత ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడటం ఆందోళనకర పరిణామంగా మారుతోంది. చిన్న వయస్సులోనే ఊబకాయం, షుగర్, బీపీ వంటి సమస్యలు పెరగడానికి ఇదే ప్రధాన కారణమవుతోందని నిపుణులు చెబుతున్నారు.

**ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు**

వారంలో ఎక్కువ రోజులు ఇంట్లో తయారు చేసిన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలి. పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, సంపూర్ణ ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. అధిక నూనె, ఉప్పు, చక్కెర కలిగిన ఆహారాలను తగ్గించాలి.పిల్లలకు జంక్ ఫుడ్ అలవాటు కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.బయట ఆహారం తీసుకునేటప్పుడు పరిశుభ్రత ఉన్న చోట్లనే కొనుగోలు చేయాలి.రోజువారీ వ్యాయామం, నడక వంటి శారీరక శ్రమకు సమయం కేటాయించాలి.కనువిప్పు కలిగించాల్సిన సమయం నాలుక రుచికోసం క్షణిక ఆనందాన్ని ఇచ్చే జంక్ ఫుడ్, భవిష్యత్తులో జీవితాంతం బాధించే అనారోగ్యాలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రజలు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.నేడు తీసుకునే సరైన ఆహార నిర్ణయాలే రేపటి ఆరోగ్యకరమైన జీవితానికి బాటలు వేస్తాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



# సిలిండర్లు అందక రోడ్డెక్కిన ప్రజలు

**• గ్యాస్ కోసం గంటల తరబడి నిరీక్షణ**

**శివంపేట జూన్ 5 ( సిరి న్యూస్ )**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జాప్యంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తూప్రాన్–నర్సాపూర్ ప్రధాన రహదారిపై గ్యాస్ సిలిండర్లను రోడ్డుపై ఉంచి నిరసన చేపట్టారు. రెండు మూడు రోజులుగా గ్యాస్ కోసం ఏజెన్సీ చుట్టూ తిరుగుతున్నప్పటికీ సిలిండర్లు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వినియోగదారుల కథనం ప్రకారం, గ్యాస్ కోసం ఏజెన్సీ వద్దకు వెళ్తే సర్వర్ పనిచేయడం లేదని, గ్యాస్ నిల్వలు లేవని, ఇతర కారణాలు చెబుతూ తిరిగి పంపిస్తున్నారని ఆరోపించారు. గతంలో గ్రామాల్లోనే గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసిన వాహనాలు కూడా కొంతకాలంగా రావడం లేదని తెలిపారు. దీంతో ఏజెన్సీ వద్దకు వచ్చి గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల పాటు వేచి ఉన్నా గ్యాస్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.కొంతమంది వినియోగదారులు మాట్లాడుతూ, గ్యాస్ కనెక్షన్ తీసుకుని ఒకటి నుంచి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు గ్యాస్ బుక్ లేదా ఖాతా వివరాలు ఇవ్వలేదని ఆరోపించారు. గ్యాస్ బుక్ గురించి అడిగితే 15 లేదా 20 రోజుల్లో ఇస్తామని చెబుతున్నారని, అయితే రెండేళ్లు గడిచినా అందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా గ్యాస్ బుక్ లేదనే కారణంతో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు.గ్యాస్ సరఫరాను వెంటనే పునరుద్ధరించి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఏజెన్సీ పనితీరుపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వినియోగదారులు ఆందోళనను విరమించారు.

# గీతంలో క్వాంటం సాంకేతికతపై పరిశోధన

## జేఆర్ఎఫ్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

## ఈనెల 12లోగా దరఖాస్తులు సమర్పించాలి

## డీఎస్టీ నిధులతో రూ.45.43 లక్షల ప్రాజెక్టు

**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 5 (సిరి న్యూస్):**

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం క్వాంటం సాంకేతికతల అభివృద్ధికి సంబంధించిన పరిశోధన ప్రాజెక్టును చేపట్టింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ (డీఎస్టీ) నిధులతో నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వెల్లడించింది.ఈ పరిశోధనను ఐఐటీ బొంబాయి, ఇటలీలోని సాపియెంజా విశ్వవిద్యాలయాల సహకారంతో నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థి అంతర్జాతీయ పరిశోధన బృందంతో కలిసి పనిచేసే అవకాశం పొందుతారని తెలిపారు.ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బీటెక్ లేదా ఎంటెక్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేట్ అర్హత, పరిశోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.మూడేళ్ల కాలపరిమితి గల ఈ ఫెలోషిప్‌లో తొలి రెండేళ్లు నెలకు రూ.37 వేలతో పాటు హెచ్ఆర్ఏ, మూడో ఏడాది సీనియర్ రీసెర్చ్ ఫెలోగా నెలకు రూ.42 వేలతో పాటు హెచ్ఆర్ఏ అందజేయనున్నట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టుకు డాక్టర్ శాంతను సాహ ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరిస్తుండగా, డీఎస్టీ నుంచి రూ.45.43 లక్షల గ్రాంటు మంజూరైంది. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి భవిష్యత్తులో పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంటుందని విశ్వవిద్యాలయం పేర్కొంది.

# బీహెచ్ఈఎల్ లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం..

## గ్రీన్ ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమంతో పర్యావరణ సందేశం



**రామచంద్రపురం, జూన్ 5 (సిరి న్యూస్):**

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ హైదరాబాద్, రామచంద్రపురం యూనిట్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "ప్రకృతితో స్ఫూర్తి పొందుదాం; వాతావరణం మరియు మన భవిష్యత్తును కాపాడుకుందాం" అనే థీమ్‌తో పలు కార్యక్రమాలు చేపట్టారు.ఆరోగ్య, భద్రత మరియు పర్యావరణ (ఏచ్ఎస్ఇ) విభాగం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి నెహ్రూ ఉద్యాన్ పార్క్ వరకు గ్రీన్ ర్యాలీ సాగింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో ఉద్యోగులు పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తూ ప్లకార్డులు, నినాదాలతో అవగాహన కల్పించారు.టౌన్‌షిప్ పరిపాలన విభాగం ఆధ్వర్యంలో టౌన్ సెంటర్ పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కలిసి సుమారు 40 మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు నందు, డాక్టర్ సంధ్యా కర్, ఏజీఎం సురన్ ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# దూలపల్లిలో పలు కాలనీలలో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు.



**కొంపల్లి.జూన్.05(సిరి న్యూస్)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్ లోని బీజేపీ నాయకులు పలు కాలనీలలో మొక్కలు నాటారు.దూలపల్లి డివిజన్ సీనియర్ నాయకులు బూర్గుబావి దుర్గ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి యువ నాయకులు గరీషే అశ్విన్ మరియు సీనియర్ నాయకులు పాల్గొని పలు రకాల మొక్కలను కాలనీలలో నాటారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ తమ ఇంటి ముందు ఒక్క మొక్కను నాటుకోవాలని సూచించారు.చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని చెట్లు లేకపోవడంతో ప్రస్తుతం మనం అందరం ఆక్సిజన్ కొనాల్సి వస్తుందని చెట్లు ఉంటే వాటి నుండి వచ్చే గాలితో ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని రానున్న రోజుల్లో పూర్తిగా కలుషితం అవ్వడం జరుగుతుందని ఆ దుస్థితి రాకముందే ఇప్పటి నుండి ప్రతి ఒక్కరం ఒక్క చెట్టును నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా.శేఖర్.నర్సింగ్ రావు.రమేష్.శివులు.నర్సింహా.సత్యనారాయణ.శ్రీశైలం.కుమార్.బీజేపీ పాల్గొన్నారు.

# బర్డ్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ.

**మెదక్ జూన్,05(సిరిన్యూస్)**



ప్రకృతి పరిరక్షణ,పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో శనివారం నిర్వహించబడే బర్డ్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి జోజి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్,ఇతర జిల్లా అధికారులు పాల్గొననున్నారన్నారు.పోచారం ల్యాండ్‌స్కేప్ యొక్క గొప్ప పక్షి వైవిధ్యం మరియు సహజ వారసత్వం పట్ల ప్రశంసను ప్రోత్సహించడానికి, ఈ నెల 06న ఉదయం 6.30 నుండి 8.00 గంటల వరకు పోచారంలోని డిబిసిలో నిర్వహించబడే బర్డ్ వాక్‌లో ప్రజలందరూ పాల్గొనాలని తెలిపారు.పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు.ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను విక్షించాలని , పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి ,పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ఎంతో అవసరం అన్నారు, ప్రకృతిని దగ్గరగా ఆస్వాదిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడానికి బర్డ్ వాక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇస్నాపూర్‌లో నాలుగు కొత్త సబ్‌స్టేషన్లు..

- విద్యుత్ మౌలిక వసతుల బలోపేతంపై ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష

**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 05, (సిరి న్యూస్):**

ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో వేగంగా పెరుగుతున్న జనాభా, కొత్త కాలనీల విస్తరణ నేపథ్యంలో లో వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా నాలుగు నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్ పరిధి విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న ఇస్నాపూర్, నాగులపల్లి, వెలిమెల, కొల్లూరు, భానూరు, నందిగామ, క్యాసారం ప్రాంతాల్లో భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్ సరఫరా లోపాలు రాకుండా అవసరమైన చోట పిటిఆర్‌ల ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా కర్దనూర్, వెలిమల తాండ, నాగులపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీ, పాశమైలారం ప్రాంతాల్లో ఔట్‌డోర్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు త్వరలోనే రెవెన్యూ శాఖతో సమన్వయం చేసి స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ముత్తంగి ప్రాంతంలో ఇండోర్ సబ్‌స్టేషన్ కోసం కూడా స్థలం కేటాయింపు చేస్తామని హామీ ఇచ్చారు.కొల్లూరు ప్రాంతంలో రూ.130 కోట్ల వ్యయంతో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చి, స్థలం కేటాయించిందని ఎమ్మెల్యే వెల్లడించారు. పనులను వేగవంతంగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులను ఆదేశించారు.అలాగే లకడారం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నట్లు అధికారులు సమావేశంలో తెలిపారు.ఈ సమావేశంలో డీఈ నెహ్రూ నాయక్, ఏడీఈ తులసీ రామ్ తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

**సతీష్ సాగర్.**

**కొంపల్లి.జూన్.05(సిరి న్యూస్)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కొంపల్లి డివిజన్ లోని బీజేపీ నాయకులు అవని గార్డెన్ లో ఉన్న ఓ పార్కులోని పట్టణ అధ్యక్షులు సతీష్ సాగర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి స్థానిక బీజేపీ అధ్యక్షుని బాధ్యతలో మొక్కలు నాటారు.భారత ప్రధాని మాన్యశ్రీ నరేంద్ర మోదీ ఆలోచన (అమ్మ పేరుతో ఒక చెట్టు) నిజరూపం దాల్చటంలో కార్యకర్తలు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు శివాజీ రాజు, శంకర్ నాయక్, స్థానిక నాయకులు నరసింహ,మాధురి, ప్రకాష్ రావు,మహేందర్ సాగర్,అశ్విన్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ తమ ఇంటి ముందు ఒక్క మొక్కను నాటుకోవాలని సూచించారు.చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని చెట్లు లేకపోవడంతో ప్రస్తుతం మనం అందరం ఆక్సిజన్ కొనాల్సి వస్తుందని చెట్లు ఉంటే వాటి నుండి వచ్చే గాలితో ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని రానున్న రోజుల్లో పూర్తిగా కలుషితం అవ్వడం జరుగుతుందని ఆ దుస్థితి రాకముందే ఇప్పటి నుండి ప్రతి ఒక్కరం ఒక్క చెట్టును నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు.



# మహిళలు,బాలల సంక్షేమానికి సమిష్టి కృషి.

- భరోసా సేవల్లో శాఖల మధ్య సమన్వయం పెంచాలి.
- బాధితులకు సత్వర న్యాయం,సేవలందించడమే లక్ష్యం.
- జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు.

**మెదక్ జూన్,05(సిరిన్యూస్)**

మహిళలు,చిన్నారులపై జరిగే హింస,వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు రక్షణ, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు సమర్థవంతంగా అందించేందుకు సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం భరోసా కార్యక్రమానికి సంబంధించిన కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు జరగడంతో పాటు బాధితులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవల కల్పనలో పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు సేవలు అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమయానుకూలంగా నిర్వర్తించడంతో పాటు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాధితులు అవసరమైన సేవల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట అన్ని సౌకర్యాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి ప్రసన్న కుమార్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, సీడబ్ల్యూసీ, జేజేబీ సభ్యులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా–శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ఈఆర్పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు, షీటీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మున్సిపాలిటీ అభివృద్ధికి 28 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం

- మంత్రి దామోదర్‌కు రూ.60 కోట్ల ప్రతిపాదనలు
- జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి
- అందోలు–జోగిపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం

**జోగిపేట, మే 05, సిరి న్యూస్:**



జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి 28 ఏజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. మున్సిపల్ సాధారణ సర్వ సభ్య సమావేశము శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ లైట్ల రిపేరింగ్ చేసేందుకు అవసరమైన పెద్ద ల్యాడర్‌తో పాటు డ్రిల్లింగ్ మిషన్, దోమల నివారణ కుగాను ట్రాక్టర్‌కు అమర్చే ఫాగింగ్ మిషన్‌ను కొనుగోలు చేసేందుకు తీర్మాణించారు. అందోలు–జోగిపేట మున్సిపాలిటీకి త్వరలో రూ.60 కోట్లు మంజూరు కానున్నాయని మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల అభివృద్ధికి రూ.60 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహకు అందజేసినట్లు ఆయన తెలిపారు. వార్డుల్లో మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్డు ఏర్పాటు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు వంటి అభివృద్ధి పనులను చేపడదామన్నారు. మంత్రికి అందజేసిన ప్రతిపాదనలతో దాదాపుగా అన్ని వార్డుల్లోనూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునని వైస్ చైర్మన్ చిట్టిబాబు సూచించారు. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. . పట్టణములో చేపట్టవలసిన వివిధ అభివద్ధి పనులపై సభ్యులు చర్చించారు. రానున్న వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన చర్యలపై సభ్యులు సూచనను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సిహెచ్. తిరుపతి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు కౌన్సిల్ సభ్యులు, కో అప్షన్ సభ్యులు ఏఈఈ శ్రీకాంత్ టౌన్ ప్లానింగ్ అధికారి నిహాల్ రెడ్డి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వీడ్కోలు

జోగిపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కమిషనర్ రవీందర్ రామాయంపేట మున్సిపాలిటీకి బదిలీ కావడంతో శుక్రవారం స్థానిక కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎస్.కృష్ణారెడ్డి, ఎ.చిట్టిబాబులు శాలువా,పూలదండలతో సత్కరించారు. వార్డు కౌన్సిలర్‌లు కూడా కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రవీందర్ పనితీరును ప్రశంసించారు. కొత్తగా కమిషనర్‌గా భాధ్యతలను చేపట్టిన తిరుపతిని కూడా ఈ సందర్భంగా సన్మానించారు.

# పవన్ కళ్యాణ్ తెలంగాణలో చిచ్చు పెట్టకు

- భారతదేశంలో ఎక్కడైనా పోటీ చేసుకో.
- తెలంగాణ త్యాగాల గడ్డ రక్తం చిందించిన నేల ఖబర్దార్.
- తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి లేకుంటే తెలంగాణలో అడ్డుకుంటాం.
- తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్చార్జి వీరప్ప గారి రమేష్ గౌడ్.



**మెదక్ జూన్,05(సిరిన్యూస్)**

తెలంగాణ త్యాగాల గడ్డ ఉద్యమాల కోసం రక్తం చిందించిన నేల, అనేక పోరాటాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తెలంగాణా లో చిచ్చు పెట్టాలని చుస్తే ఎవర్నైనా పరుగులు పెట్టిస్తామని తెలంగాణ రక్షణ సేన మెదక్ నియోజకవర్గం ఇన్చార్జి వీరప్ప గారి రమేష్ గౌడ్ అన్నారు.అమరులైన అసలైన ఉద్యమ కారుల గడ్డ.. కబర్దార్ బిడ్డ.. వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేదంటే తెలంగాణలో పవన్ కళ్యాణ్ అడ్డు కుంటామని హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తెలంగాణలో రెండు రాష్ట్రాల చిచ్చు పెట్టి తెలంగాణ ప్రజలను అవమాన పరిచే విధంగా ఉన్నాయని హెచ్చరించారు. భారతదేశంలో రాజ్యాంగబద్ధంగా ఎవరైనా ఎక్కడైనా పోటీ చేసుకోవచ్చని దాని మేము అడ్డుకోబమని తెలంగాణ ప్రజల మీద నువ్వు చేసిన వ్యాఖ్యలకు కచ్చితంగా అడ్డు కుంటామని తెలంగాణ రక్షణ సేన హెచ్చరించే తెలంగాణ మహిళల మీద పవన్ కళ్యాణ్ కార్యకర్తలు పిచ్చి పిచ్చి బూతులతో మెసేజ్లు పెట్టడం పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి హోదాలో ఆంధ్ర రాష్ట్రానికి అభివృద్ధి చేయడానికా..?లేదా కార్యకర్తలు విమర్శించడానికి అని ఆయన దుయ్యబట్టారు భారతదేశంలో 29 రాష్ట్రాలకు తెలంగాణలో ఆర్థికంగా ఉద్యోగ పరంగా బతుకు తెరువు కోసం తెలంగాణ రాష్ట్రం అన్నం పెడుతుందని ఉద్యమాలతో రక్తం చిందించిన తెలంగాణ వీరులు ఉన్న ప్రాంతం అన్నారు.పవన్ కళ్యాణ్ పిచ్చికూతలు కోస్తున్నారని తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలో కచ్చితంగా అడ్డుకుంటా మన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి..





- పక్కగా జనగణన జరగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**రామాయంపేట, (నార్సింగి)జూన్ 5 (సిరి న్యూస్)**

వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , జన గణనను డిఎంసిఎస్, డిఎస్ఓ, ఆర్డిఓ, తాహాసిల్దార్, జన గణన అధికారులతో కలిసి పరిశీ లించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అత్యంత వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలని, ధాన్యం పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు , వస్తు సామాగ్రిని, హమాలిలను ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో పని చేయించాలన్నారు. మిల్లులో అతి త్వరగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని అధికారులను ఆదేశించారు. జన గణన పక్కగా చేయాలన్నారు. జన గణన లో ప్రజల యొక్క సమాచారం పక్కగా నమోదు చేసి ఆన్లైన్ ఆప్ లో నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ తో పాటు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించడం మనందరి కర్తవ్యం

- అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామసభ
- గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి



**గుమ్మడిదల, జూన్ 5 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని గ్రామంలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పరిశుభ్రతే మూలమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గ్రామం ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని చెప్పారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం కేవలం గ్రామపంచాయతీ లేదా పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి గ్రామస్తుడి సామాజిక బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తప్పనిసరిగా తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి అందించాలని సూచించారు. చెత్తను వేరు చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభమ వడంతో పాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతిని సంరక్షించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, చెట్లను నాటడం, వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణ హిత వస్తువులను వినియో గించడం వంటి చర్యలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. పరిశుభ్రమైన పరిసరాలు ఉంటేనే ఆరోగ్య సమస్యలు తగ్గి, గ్రామాభివృద్ధి వేగ వంతమవుతుందని తెలిపారు. మన గ్రామం – మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహ కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ యాదవ్, ఉప సర్పంచ్ ఓట్ల యాదిరెడ్డి, వార్డు సభ్యులు పెరుగు ప్రభాకర్, పెరుగు మంగ, ఎల్లంకి పావని, రామగాళ్ల రాములు, జింక అశ్విని, నాయకులు చిమ్ముల నరేందర్ రెడ్డి, జింక గోపాల్, మన్నె మహేష్, విప్ప శేఖర్, గోస్కొండ బాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## సభా ప్రాంగణ , భద్రత, వేదిక నిర్మాణం, పనులను ఏర్పాట్లను పరిశీలించిన





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి (సిరి న్యూస్ జూన్ 5)**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి బాచుపల్లి ఫ్లవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో, సభ నిర్వహణకు కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కుకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. డీసీసీ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి, కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

## గ్రామీణ అభివృద్ధి శాఖ లక్ష్యాలను సాధించాలి

**జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచాలి.**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**




**మెదక్ జూన్,05(సిరిన్యూస్)**

గ్రామీణ అభివృద్ధి శాఖ 2026-27 సంవత్సరానికి తమ లక్ష్యాలను సమర్థ వంతంగా చేదించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.శుక్రవారం కలెక్ట రేట్లోని మీటింగ్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన మహిళ సంఘాల నమోదు, శ్రీనిధి లోన్స్,ధాన్యం కొనుగోళ్లు,ఇందిరా మహిళా చీరల పంపిణీ,గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులు, సోలార్ పంపు సెట్లు, పెట్రోల్ బంకులు, చేయూత పింఛన్లలో తమ లక్ష్యాలు సాధిం చాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, అడిషనల్ గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లు ప్రారంభం



**కొల్చారం, జూన్ 5, (సిరి న్యూస్),**

,కొల్చారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సిసి రోడ్డు నిర్మాణం పనుల కొరకు ఎంపీ నిధుల నుండి పది లక్షల రూపాయలు మంజూరు అయినవి అని గ్రామ సర్పంచ్ స్వప్న ఊష య్య తెలిపారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా ఒకటవ వార్డు, పదవ వార్డులలో నూతనంగా చేపట్టనున్న 250 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం గ్రామ సర్పంచ్ స్వప్న ఊష య్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలపడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రజల సౌకర్యార్థం రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. నాణ్యత ప్రమాణాలతో ఈ రోడ్డు పనులను గడువులోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ నిధుల నుండి మంజూరు చేయించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందాపురం నిర్మల శేఖర్ యాదవ్ , మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి, వెంకట రాములు ,పంచాయతీ సెక్రెటరీ మమత, వార్డు మెంబర్స్ అక్కెం ప్రవీణ్ యాదవ్, తోశ నవీన్, పసుల రేఖ యాదగిరి, నాయకులు ఎంచర్ల శేఖర్ యాదవ్,ఎంబరి శేఖర్ వడ్ల సంతోష్ కుమార్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విరూపాక్ష హరిత సంకల్పం

**పచ్చని సంకల్పం 1860 మొక్కలతో ప్రకృతికి వందనం**

**పర్యావరణ పరిరక్షణలో విరూపాక్ష ముందడుగు**

**జిన్నారం జూన్ 5 సిరి న్యూస్**




గడ్డపోతారం పురపాలిక పరిధిలోనీ విరూపాక్ష ఆర్గనైజ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పార్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గడ్డపోతారం పారిశ్రామిక వాడలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు భారీ లక్ష్యం అద్భుత విజయం పర్యావరణ సమతుల్యతను కాపాడటమే ధ్యేయంగా యాజమాన్యం మరియు కార్మికులు కలిసి ఒకే రోజున ఏకంగా 1860 మొక్కలను నాటి తమ పట్టుదలను చాటుకున్నారు.సామాజిక బాధ్యత పరిశ్రమల వల్ల కలిగే కాలుష్యాన్ని అరికట్టడానికి మరియు భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందిం చడానికి ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు ఎంతో అవసరమని సంస్థ యాజమాన్యం పేర్కొంది. సంరక్షనే ముఖ్యం కేవలం మొక్కలు నాటడమే కాకుండా నాటిన ప్రతి ఒక్క మొక్కను దత్తత తీసుకొని అవి వృక్షాలుగా మారేవరకు నీరు పోసి కాపాడు తామని పరిశ్రమ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ఇతర పరిశ్రమలకు ఆదర్శం పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్య నివారణకు విరుపాక్ష ఆర్గనైజ్ ప్రైవేట్ లిమిటెడ్ తీసుకున్న ఈ హరిత చొరవ మిగతా పరిశ్రమలకు సైతం ఆదర్శంగా నిలిచిందని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో విరుపాక్ష ఆర్గానిక్స్ ఉన్నత అధికారులు, మేనేజ్మెంట్ ప్రతినిధులు,సిబ్బంది మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా మొక్కలు నాటారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..

**మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ**

**వెల్దుర్తి , జూన్ 05, ( సిరి న్యూస్):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వెల్దుర్తి మండలం జలాల్పూర్ గ్రామంలో మొక్కలు నాటిన మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు రంగి కృష్ణ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క నాటాలని, గ్రామంలోని ప్రతి ఇంటికి రెండు ముక్కలు చొప్పున నాటే కార్యక్రమాన్ని మొదలు పెట్టామని,పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా గుర్తించాలన్నారు. కలుషితం అవుతున్న ప్రకృతిని మొక్కలు నాటి కాపాడాల్సిన బాధ్యత ప్రజల పై ఉందని పిలుపునిచ్చారు. ప్రకృతి కాపాడడంతోపాటు ప్లాస్టిక్ నిషేధం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉంటేనే ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందని గుర్తు చేశారు. ప్రకృతి ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. వెల్దుర్తి మండలంలోని నా సహచర సర్పంచులు అందరూ కలిసి మా కుమ్మడిగా పర్యావరణ పరిరక్షణ చేయాలని అలాగే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకుల కు అందించాలి.

- మెదక్ ఫారెస్ట్ ను టూరిస్ట్ హబ్ గా రూపొందించాలి
- జిల్లావ్యాప్తంగా గ్రీన్ యాక్షన్ ప్లాన్
- తయారీకి పటిష్ట ప్రణాళిక
- 200 చెట్లతో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ప్రారంభోత్సవం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- తెలంగాణ అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రత్నాక జోహారీ.



**రామాయంపేట, జూన్ 5 (సిరి న్యూస్)**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ శివారులోని వన్ యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజశేఖర్రెడ్డి, కోశాధికారి డి.జి. శ్రీనివాస శర్మ, గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు.అనంతరం అటవీ శాఖ ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడిని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటమని ప్రోత్సహించే ఒక హృదయ పూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం అన్నారు. ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి, మరింత పచ్చని గ్రహాన్ని పెంపొందుతుంది

అన్నారు.మొక్కలు నాటుతున్నప్పుడు, మీ అమ్మ ప్రేమను, త్యాగాలను గౌరవించడానికి ఒక్క క్షణం కేటాయించాలని హితవు పలికారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించి అంశాలపై విద్యార్థి దశ నుండే తెలుసుకోవాలన్నారు.జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు.ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు.జిల్లాలో అటవీ సంపదను పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. భవిష్యత్ తరాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా అడవులను సంరక్షించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారని వివరించారు.జిల్లాస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా అర్బన్ ఫారెస్ట్ పార్కుల పర్యాటకులకు ప్రాచుర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాక జోహారీ మాట్లాడుతూ.. జిల్లాలో వరల్డ్ ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సదాశివ నగర్ అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి మృతి. కారణాలపై ఫారెస్ట్ శాఖ దర్యాప్తు





**రామాయంపేట, జూన్ 5 (సిరి న్యూస్ )**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సదాశివ నగర్ తండా సమీప అటవీ ప్రాంతంలో శుక్రవారం ఓ ఎలుగుబంటి మృతదేహం కనిపించడం కలకలం రేపింది. గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో ఎలుగుబంటి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలుగుబంటి అస్వస్థతకు గురై మృతి చెందిందా, లేక మరే ఇతర కారణాలతో ప్రాణాలు కోల్పోయిందా అనే విషయాలు ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు తెలిపారు.ఎలుగుబంటి మృతికి గల అసలు కారణాలను తెలుసుకునేందుకు పోస్టుమార్టం నిర్వహించి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ఫారెస్ట్ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, ఇటీవల అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో అడవి జంతువుల సంచారం పెరుగుతుండటంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ఎలుగుబంటి మృతిపై పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఘనంగా బిఆర్ఎస్వి మెదక్ నియోజకవర్గ నాయకులు గంజి నవీన్ జన్మదిన వేడుకలు..

- కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జిల్లా బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి..

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి (జూన్ 5సిరి న్యూస్)**





మెదక్ నియోజకవర్గం బీఆర్ఎస్వి నాయకులు గంజి. నవీన్ జన్మదిన వేడుకలు మెదక్ జిల్లా బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాదులోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు.నవీన్తో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ..యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగుతున్న గంజి నవీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఆయన మరింత చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నవీన్కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం గంజి నవీన్ మాట్లాడుతూ...తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి గారికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు, యువ నాయకులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాచల వేదపండితులచే శ్రీ సీతారామ కళ్యాణం

**పటాన్చెరు, జూన్ 5, (సిరి న్యూస్ );**

శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్య అనుగ్రహంతో కాకతీయ నగర్లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జూన్ 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు భద్రాచలం నుండి విచ్చేసే ఉత్సవమూర్తులకు మంగళవాయిద్యాలు, హారతులు, కోలాటాలు, భజనలతో ఘన స్వాగతం పలకనున్నారు.అలాగే జూన్ 7వ తేదీ ఉదయం 10 గంటలకు భద్రాచల వేదపండితులచే శ్రీ సీతారాముల దివ్య కళ్యాణం నిర్వహించబడనుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం మరియు అన్న ప్రసాదం పంపిణీ చేయనున్నారు.ఈ పవిత్ర మహోత్సవంలో భక్తులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారాముల ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరింది. వేదిక: శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, కాకతీయ నగర్, రామచంద్రాపురం, బీహెచ్ఈఎల్, హైదరాబాద్.

# మున్సిపల్ కమిషనర్ కు ఘన సన్మానం

## శాలువాతో సత్కరించిన నాయకులు

**జిన్నారం జూన్ 5 సిరి న్యూస్**



గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ తాన్య ను పట్టణ ముఖ్య నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సందర్భంగా గడ్డపోతారం మాజీ వార్డు సభ్యులు కుమార్, శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం మరియు పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. వీధి దీపాలు, వేసవి నీటి ఎద్దడి వంటి కొన్ని ప్రధాన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినం అని ఆయన అన్నారు.

# అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహిళ..

## ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు

**రామచంద్రపురం, జూన్ 5 (సిరి న్యూస్):**



రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ గుర్తుతెలియని మహిళ ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ మహిళ తన గురించి కొంత సమాచారం వెల్లడించిన అనంతరం అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో, ఆమె గుర్తింపు మరియు కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం అనంతరం స్పృహలో ఉన్న సమయంలో ఆమె తాను సుల్తాన్పూర్ ప్రాంతానికి చెందినదానినని, తన ఇద్దరు కుమారులు బహదూర్పూర్ ప్రాంతంలోని ఓ మదర్సాలో చదువుతున్నారని చెప్పింది. అయితే కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆమె నుంచి మరిన్ని వివరాలు సేకరించడం సాధ్యపడలేదు.దీంతో మహిళ పూర్తి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం తెలుసుకునేందుకు రామచంద్రపురం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్థానికంగా విచారణ జరుపుతూ, ఆమె బంధువులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.ఈ మహిళకు సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే వెంటనే రామచంద్రపురం పోలీస్ స్టేషన్ను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మొక్కలు నాటితే ప్రకృతి పరవసిస్తుంది

## మెదక్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ భవాని.



**జూన్ 5 (సిరి న్యూస్ )**

మొక్కలు నాటుతేనే పకృతిని కాపాడగలమని మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ భవాని పేర్కొన్నారు.శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. భవాని మాట్లాడుతూ, మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని పరిరక్షించుకోవడంతో పాటు మన జీవన విధానానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ సంపర్క్ ప్రముఖ్ డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు. "మనము పర్యావరణాన్ని పరిరక్షిస్తే, పర్యావరణం మనల్ని రక్షిస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం మరియు వాటి సంరక్షణ అత్యంత అవసరమని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చక్రవర్తి, నారాయణ, మేఘజ్యోతి, నాన్-టీచింగ్ సిబ్బంది సుదర్శన్, పుష్ప, రేణుక, శర్మ, మెదక్ జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్, కో-కన్వీనర్ కిషన్ ప్రసాద్, న్యాయవాది కరణ్, రామకృష్ణ, అధ్యాపకులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు హాజరై మొక్కలు నాటారు.



# పొగడ్తలను తలకెక్కించుకోను..



టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్‌కు గత కొద్ది కాలంగా అదృష్టం అస్సలు కలిసి రావడం లేదు. ఎంత కష్టపడినప్పటికీ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. ఇటీవల చేసిన హరి హరి వీరమల్లు, ది రాజా సాబ్ రెండు భారీ అంచనాలు మధ్య విడుదలై ఆశించనంత స్థాయిలో హిట్ అందుకోలేకపోయాయి. నిధి కష్టపడినప్పటికీ శ్రమ అంతా వృధా అయిపోయింది. దీంతో గత కొద్ది కాలంగా నిధిపై విమర్శలు వస్తున్నాయి. కష్టపడినప్పటికీ ఇండస్ట్రీలో రాణించాలంటూ అదృష్టం కూడా ఉండాలని నెగెటివ్ కామెంట్లు పెడుతున్నారు. అంతేకాకుండా ఐరన్ లెగ్ అంటూ ట్రోల్ కూడా చేస్తున్నారు. తాజాగా, తనపై వస్తున్న విమర్శలపై నిధి అగర్వాల్ స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ పొగడ్తలను తలకెక్కించుకోను, అలాగే విమర్శలను అస్సలు పట్టించుకోను. ఇండస్ట్రీలో ఒక సక్సెస్‌ఫుల్ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుంది, దానికి నేనేమీ మినహాయింపు కాదు. కానీ, ఇండస్ట్రీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఒక సినిమా సక్సెస్ అనేది చాలా విషయాలపై ఆధారపడి ఉంటుంది. నేను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయ్యాయి, అందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, నన్ను నేను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాను" అని చెప్పింది. తనను అదృష్టం లేని నటిగా విమర్శిస్తున్న వారికి సమాధానమిస్తూ.. తాను అదృష్టం కంటే కేవలం తన టాలెంట్‌ను మాత్రమే నమ్ముకుంటానని నిధి స్పష్టం చేసింది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా నటిగా తన వంద శాతం శ్రమను ఎప్పుడూ పెడుతూనే ఉంటానని తెలిపింది. నిధి చేసిన ఈ కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్ని పరాజయాలు ఎదురైనా కుంగిపోకుండా, తన టాలెంట్‌పై నమ్మకంతో ఉన్న నిధిని అభిమానులు అభినందిస్తున్నారు.

## ఆ మ్యూజిక్ డైరెక్టర్ ని చూసి ఇతర సంగీత దర్శకులు చాలా నేర్చుకోవాలి

సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో మోస్ట్ టాలెంటెడ్ అండ్ బిజీయెస్ట్ సెలబ్రిటీలలో మ్యూజిక్ డైరెక్టర్ కమ్ హీరో జీవీ ప్రకాష్ కుమార్ టాప్ ప్లేస్ లో ఉంటాడు. ప్రస్తుతం జీవి చేతిలో గంపెడు సినిమాలు ఉన్నాయి. ఒకవైపు క్రేజీ ప్రాజెక్టులకు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తూ, మరోవైపు నటుడిగా వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ కోలీవుడ్, టాలీవుడ్ లలో ఫుల్ బిజీగా ఉన్నాడు జీవీ.'
జీవీ ప్రకాష్ కేవలం తమిళంలోనే కాకుండా తెలుగులోనూ టాప్ స్టార్స్ చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నాడు. వాటిలో మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ఇరుముడి ఇటీవల రిలీజ్ అయినా గ్లిమ్స్ కు మంచి బిజియమ్ ఇచ్చాడు. ఇక కోలీవుడ్ స్టార్ సూర్య, యాక్షన్ కింగ్ విశాల్ ల రాబోయే సినిమాలకు కూడా జీవీనే సంగీతం అందిస్తున్నాడు. అనిరుధ్ త్వరగా ఇవ్వడు, తమన్ తెలుగులో ఫుల్ బిజీ కావడంతో అగ్ర దర్శకులు, అగ్ర హీరోల ఫస్ట్ ఛాయిస్ గా జీవీ ప్రకాష్ దూసుకుపోతున్నారు. సంగీత దర్శకుడిగా ఇంత బిజీగా ఉంటూనే జీవీ ప్రకాష్ హీరోగా కూడా వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నారు. నటుడిగా జీవీ డైరీ ప్రస్తుతం పూర్తిగా నిండిపోయింది. ఉదయం రికార్డింగ్ థియేటర్ లో కంపోజింగ్ లో ఉంటే మధ్యాహ్నం సినిమా సెట్స్ లో కెమెరా ముందుకు వచ్చి నటిస్తూ 24/7 బిజీగా గడుపుతున్నారు. సాధారణంగా ఒకే రంగంలో రాణించడం కష్టంగా భావించే ఈ రోజుల్లో సంగీతం, నటన అనే రెండు భిన్నమైన విభాగాల్లో జీవీ ప్రకాష్ చూపిస్తున్న మల్టీ టాస్కింగ్ ప్రతిభ నిజంగా అభినందనీయం. టైమ్ మేనేజ్మెంట్ లో జీవీ ప్రకాష్ రూటే వేరు. ఇంత క్రేజీ ప్రాజెక్టులను బ్యాలెన్స్ చేస్తూ ఏ ఒక్కదానికీ ఆలస్యం కాకుండా వర్క్ పూర్తి చేయడం చూస్తుంటే ఇతర మ్యూజిక్ డైరెక్టర్లు కూడా జీవీ ప్రకాష్ ని చూసి నేర్చుకోవాల్సిందే అని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.





## వరుస ఫ్లాపుల తర్వాత హిట్ కోసం వైష్ణవ్ తేజ్ భారీ స్కెచ్..

మెగా హీరో వైష్ణవ్ తేజ్ 'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీసు వద్ద తన సత్తా చాటారు. మొదటి మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ తర్వత రంగరంగ వైభవంగా, కొండ పొలం వంటి చిత్రాలు చేసినప్పటికీ వైష్ణవ్ తేజ్ హిట్ అందుకోలేకపోయారు. ఇక 2023లో చేసిన ఆదికేశవ కూడా ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. ఇలా వరుసగా మూడు ఫ్లాపులు రావడంతో వైష్ణవ్ తేజ్ తీవ్ర నిరాశకు గురయ్యారు. తదుపరి సినిమా విషయంలో ఎలాగైనా సరే హిట్ కొట్టాలనే పట్టుదలతో ఆయన ఇండస్ట్రీకి కాస్త గ్యాప్ ఇచ్చారు. కేవలం హిట్ కోసమే కాకుండా, తన నటనకు సరిపోయే వైవిధ్యమైన కథ కోసం వేట ప్రారంభించారు. ఈ క్రమంలో.. గత మూడేళ్లలో ఆయన ఏకంగా 100కు పైగా కథలను విన్నట్లు టాక్. ఎన్నో కథలను తిరస్కరించిన తర్వాత, ఎట్టకేలకు ఆయన తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఖరారు చేసుకున్నట్లు సమాచారం. దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక అద్భుతమైన కథాంశం నచ్చడంతో వైష్ణవ్ తేజ్ ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన AK ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఆ వెంటనే సినిమా షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందట. లాంగ్ గ్యాప్ తర్వాత వైష్ణవ్ తేజ్ ఒక మంచి కథతో వస్తుండటంతో మెగా అభిమానుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. 100 కథలు విని ఓకే చేసిన ఈ సినిమాతో వైష్ణవ్ తేజ్ మళ్లీ 'ఉప్పెన' లాంటి ఘన విజయాన్ని అందుకుని, సక్సెస్ ట్రాక్‌లోకి ఎక్కుతారని అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## వాళ్లను స్వయంగ కలిసి ఈ కథ రాశా..



'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వస్తున్న మూవీ 'నూరు సామి'. తెలుగులో ఈ చిత్రం 'వంద దేవుళ్ళు' పేరుతో రిలీజ్ కాబోతున్నది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య జూన్ 19న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో భాగంగా సినిమాకు సంబంధించిన విశేషాలు పంచుకున్నాడు డైరెక్టర్ శశి. 'నూరుసామి కథ ఒక వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందించబడింది. నేను మొదట వారిని ఒక రియాలిటీ షోలో చూశాను. ఆ షో చూస్తున్నప్పుడు నాకు ఎంతో బాధ, భావోద్వేగం కలిగాయి. ఆ తర్వాత, నేను వారిని స్వయంగా కలిసి, వారి గ్రామాన్ని సందర్శించి, అక్కడి చాలా మందిని ఇంటర్వ్యూ చేశాను. వారిని నిజ జీవితంలో కలవడం, వారి అనుభవాల గురించి తెలుసుకోవడం ఈ కథను రాయడానికి నాకు ఎంతగానో సహాయపడింది' అని తెలిపారు. కాగా.. ఈ చిత్రంలో స్వాసిక అజయ్, కావ్య, శక్తి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. రామాంజనేయులు జవ్వాని నిర్మిస్తున్నారు.

## ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు..





మూడేళ్ల గ్యాప్ తర్వాత అక్కినేని అఖిల్ మళ్లీ 'లెనిన్' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళి కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా కనిపించనుంది. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను జూన్ 26న థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్ జోరు పెంచి వరుస అప్డేట్స్ విడుదల చేస్తున్నారు. మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసి ఇప్పటికే రెండు పాటలను విడుదల చేయగా.. ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా నుంచి 'సోల్ ఆఫ్ లెనిన్' పేరుతో మూడో పాటను విడుదల చేశారు. ఈ పాట ఎమోషనల్‌గా సాగుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.
ముఖ్యంగా ఈ సాంగ్ విడుదల చేస్తూ చిత్రబృందం సోషల్ మీడియాలో పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ''ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు'' అనే ఆసక్తికరమైన లైన్‌ను జోడించడంతో, సినిమాలో ప్రేమ ,యాక్షన్ అంశాలు ఏ స్థాయిలో ఉండబోతున్నాయో అర్థమవుతోంది. స్టార్ కంపోజర్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మూడేళ్ల నిరీక్షణ తర్వాత అఖిల్ పక్కా మాస్ అండ్ క్లాస్ సబ్జెక్ట్‌తో వస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## ఒక అద్భుత లోకంలోకి అడుగుపెట్టండి.. టీజర్ అప్డేట్‌తో సినిమాపై హైప్

వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా దూసుకుపోతున్న అక్కినేని సుమంత్ త్వరలో ప్రతిష్టాత్మక చిత్రం 'మహేంద్రగిరి వారాహి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం, అతీంద్రియ శక్తులు, కొన్ని రహస్య మరణాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చెయ్యగా సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. అలాగే ఇటీవల ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని నెలకొల్పగా.. ఇప్పుడు అదే జోష్‌తో తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'మహేంద్రగిరి వారాహి ద్వారాలు తెరుచుకోబోతున్నాయి. రహస్యాలు, విశ్వాసం, అంతుచిక్కని విషయాలతో కూడిన ఒక అద్భుత లోకంలోకి అడుగుపెట్టండి. జూన్ 8 న మహేంద్రగిరి వారాహి టీజర్ రాబోతున్నది సిద్ధంగా ఉండండి' అంటూ చెప్పుకొచ్చారు. కాగా.. మీనాక్షి గోస్వామి, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా.. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మధు కాలిపు, లక్ష్మణ్ నిర్మిస్తున్నారు.





## 100 కథలు రిజెక్ట్ చేసి ఎట్టకేలకు కొత్త సినిమాను లైన్ లో పెట్టిన యంగ్ హీరో

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రుక్మిని వసంత్, నయనతార, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రలో కనిపించనున్నారు. డ్రగ్స్ మాఫియా చుట్టూ తిరిగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. ఇందులోంచి వచ్చిన టీజర్ సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఇక ముందుగా మార్చిలో విడుదల చేయాలనుకున్న మేకర్స్ పలు కారణాల వల్ల జూన్ 4న వాయిదా వేశారు. నిజానికి ఈ సినిమాను జూన్ 4న (నేడే) విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించారు. అయితే నేడు సినిమా రిలీజ్ కావాల్సి ఉన్నా, ఎలాంటి ప్రమోషన్స్ కానీ, అప్‌డేట్స్ కానీ లేకపోవడంతో సోషల్ మీడియాలో పలు రకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. మూవీ షూటింగ్ పూర్తయినప్పటికీ షాకింగ్ ట్విస్ట్ వచ్చి పడింది. అయితే కొన్ని సీన్స్ విషయంలో హీరో యష్ అసంతృప్తిగా ఉన్నారని.. అందుకే ఏకంగా 100 రోజుల పాటు కొన్ని కీలక సన్నివేశాలను రీషూట్ చేయాలని నిర్ణయించుకున్నట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. దీనికి తోడు విదేశీ పంపిణీ పరంగా కొన్ని సమస్యలు తలెత్తడం కూడా వాయిదాకు కారణమని అంటున్నారు. ఈ కారణాల వల్లే సినిమాను వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ, నేడు థియేటర్లలో చూడాల్సిన సినిమా ఇలా వాయిదా పడటం.. రీషూట్ వార్తలు రావడం చూసి యష్ ఫ్యాన్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నిజంగానే ఇప్పట్లో విడుదల చేయరేమో అని పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.